ప్రజాశక్తి
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

కౌన్సిల్‌లో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు గంగారావు, స్టాలిన్

- జివిఎంసి కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం
- మూడు రోజుల సర్వసభ్య సమావేశంలో 81 అంశాలు ఆమోదం, 1 తిరస్కరణ, 1 వాయిదా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు జివిఎంసి కౌన్సిల్ సభ్యులంతా ఏకమయ్యారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, అందుకోసం విశాఖ మేయర్ ఆధ్వర్యంలో అఖిలపక్ష బృందం ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామితో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోడీని కలవాలని కౌన్సిల్‌లో గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ వాణిని వినిపించేందుకు పార్టీలకతీతంగా కౌన్సిల్ సభ్యులందరూ మిగతా 2లో..

మాట్లాడుతున్న మేయర్ హరివెంకట కుమారి

బ్రాండిక్స్ బూటకం

బ్రాండిక్స్ (ఫైల్‌ఫొటో)

- కొత్త రాయితీలకు ఎర
- అనూహ్యంగా పేరు మార్పు
- లక్ష మందికి ఉపాధి కల్పించినట్లు ప్రకటన
- వాస్తవానికి 21 వేల మందికి మించని ఉపాధి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బిఐఎసి) పేరును అనూహ్యంగా అధిస్తాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్‌గా మార్చడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి వర్తించే రాయితీల గడువు ముగియడంతో పేరు మార్చి రాయితీలు పొందడానికి శ్రీలంకకు చెందిన బ్రాండిక్స్ యాజమాన్యం కొత్త నాటకానికి తెరతీసిందన్న ప్రచారం జరుగుతోంది. బ్రాండిక్స్ పేరు మార్పు విషయమై తమకు తెలీదని పరిశ్రమల తనిఖీ, పరిశ్రమల శాఖల అధికారులు చెప్పడంతో ఈ అనుమానాలు మరింత బలపడ్డానికి దారితీశాయి. బ్రాండిక్స్ పేరు మార్చుతున్నట్లు ఈ నెల 20న ఆ సంస్థ మీడియాకు ప్రకటన విడుదల చేసింది. 2006లో ప్రారంభమైన బ్రాండిక్స్ ఇంతవరకు లక్ష మందికి ఉపాధి కల్పించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. నాడు 60 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఎకరా రూపాయి చొప్పున వెయ్యి ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి ఆ సంస్థ పొందింది. ప్రారంభించిన నాలుగేళ్లలో కనీసం 60 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తామని ఒప్పందంలో హామీ ఇచ్చింది. కంపెనీ ఏర్పాటు చేసి దశాబ్దమున్నర కాలం దాటినా ప్రస్తుతం పనిచేస్తున్న 16 యూనిట్లలో కలిపి 21 వేల మందికి మించి ఉపాధి కల్పించలేకపోయింది. అయినా లక్ష మందికి ఉపాధి కల్పించినట్లు పేర్కొంది. బ్రాండిక్స్ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు మానేసిన, పనిచేస్తున్న కార్మికులను కలిపి లెక్కించినా లక్ష మంది వుండరని తెలుస్తోంది. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పేరుతో కారుచౌకగా ప్రభుత్వం నుంచి భూమి తీసుకొని వివిధ రాయితీలు పొందిన బ్రాండిక్స్ యాజమాన్యం లక్ష మందికి ఉపాధి కల్పించినట్లు అబద్ధపు ప్రచారానికి దిగింది. బ్రాండిక్స్ పేరు మార్పు వెనుక ప్రభుత్వం నుంచి కొత్త రాయితీలు, బ్యాంకుల నుంచి రుణాలు పొందాలన్న పథకం దాగి ఉన్నట్టు సమాచారం. అలాగే అపెరల్ సిటీలో జరిగిన ప్రమాదాలతో అంతర్జాతీయంగా బ్రాండిక్స్ తన ప్రతిష్టను కోల్పోయింది. 2022 జూన్ 3న, ఆగస్టు 2న బ్రాండిక్స్ అపెరల్ సిటీలోని సీడ్స్ కంపెనీలో విష వాయువులు లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన 539 మంది మహిళా కార్మికులకు సంబంధించి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని ఎన్‌జిటి ఆదేశించింది. పరిహారం ఇవ్వకుండా న్యాయస్థానాన్ని సదరు కంపెనీ యాజమాన్యం ఆశ్రయించింది. ప్రమాద కారణాల రీత్యా అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంలేదన్న అప్రతిష్ట అంతర్జాతీయ మిగతా 2లో..

విశాఖలో భారీ వర్షం

లోతట్టు ప్రాంత ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖ నగరాన్ని గురువారం వాన ముంచెత్తింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా నగరంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. అనేక ప్రాంతాల్లోని అపార్టుమెంట్లు, ఇళ్లల్లోకి భారీ ఎత్తున నీటిప్రవాహం వచ్చింది. లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు మిగతా 2లో..

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ సాధ్యం

వార్త 5లో..

వైసిపి విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులుగా అమర్‌నాథ్, ముత్యాలనాయుడు

అమర్‌నాథ్

ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులుగా మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు నియమితులయ్యారు. ఇంతవరకు ఆ పదవుల్లో ఉన్న కోలా గురువులుకు, బొడ్డేడ ప్రసాద్‌లకు పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఉద్వాసన పలికారు. గురువారం తాడేపల్లిలోని జగన్ నివాసంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల ముఖ్య నాయకుల సమావేశాలు వేర్వేరుగా జరిగాయి. అనంతరం అధ్యక్షుల మార్పు ప్రకటన కేంద్ర కార్యాలయం నుంచి వెలువడింది. ఈ సమావేశంలో విశాఖ జిల్లా నుంచి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి కెకె.రాజు, ఇటీవల కాలం వరకు పార్టీ జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించిన కోలా గురువులు తదితరులు హాజరయ్యారు. మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, పార్టీ పశ్చిమ ఇన్‌ఛార్జి ఆడారి ఆనంద్ కుమార్ వంటి ముఖ్య నాయకులు ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఇదిలా ఉండగా గుడివాడ అమర్‌నాథ్ 2015 నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షునిగా కొనసాగారు. 2019లో అనకాపల్లి నుంచి అసెంబ్లీకి ఎన్నికై రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2024 ఎన్నికల్లో గాజువాక నుంచి అసెంబ్లీకి పోటీ చేసి తీవ్ర పరాజయం చెందారు. వైసిపి ప్రభుత్వం ఓటమి చెందడంతో మరోసారి పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షునిగా అమర్‌నాథ్ నియమితులయ్యారు.

ఉక్కు ప్రమాదంలో గాయపడ్డ సీనియర్ మేనేజర్ మల్లేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఈ నెల 24వ తేదీన జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీనియర్ మేనేజర్ ఎస్.మల్లేశ్వరరావు బుధవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఎంఎస్ - 1 విభాగంలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్న మల్లేశ్వరరావుపై ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం స్టీల్ మెటల్ లిక్విడ్ పడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. 90 శాతం శరీరం కాలిపోవడంతో హుటాహుటిన నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స అందించడం కోసం ముంబయి తరలించాలని, దీనికి ఎయిర్ అంబులెన్స్ వినియోగించాలని చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన మృతి చెందారు. మృదు స్వభావిగా పేరు తెచ్చుకున్న మల్లేశ్వరరావు మృతి పట్ల కార్మికులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ప్రమాదంపై విచారణ కమిటీ

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వరుసుగా జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో నివారణ చర్యలకు యాజమాన్యం పూనుకుంది. ఈ నెల 24న జరిగిన ప్రమాదంపై యాజమాన్యం ఐదుగురు సభ్యులతో విచారణ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బ్రాండిక్స్ బూటకం

మార్కెట్‌లో బ్రాండిక్స్ మాటగట్టుకుంది. ఈ మచ్చను తొలగించుకునేందుకు బ్రాండిక్స్ తన పేరును అధిస్థాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్‌గా మార్చి, ఆ తరువాత మార్కెట్‌లో దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆలోచిస్తోంది. ఈ విషయాలపై స్పష్టత కోసం బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరైస్వామిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

ఉక్కు ప్రమాదంలో గాయపడ్డ సీనియర్ మేనేజర్ మల్లేశ్వరరావు మృతి

కమిటీని నియమించింది. సిపిఎం విభాగాధిపతి శంకర్‌జీ, ఎస్ఎంఎస్-1 నుంచి ఆర్‌పి సింగ్, ఎస్ఎంఎస్-2 నుంచి శశికాంత్, సేఫ్టీ విభాగం నుంచి ఎం.వరప్రసాద్, క్యూఎ విభాగానికి చెందిన అప్పారావుతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నెల 28 నాటికి కమిటీ నివేదిక అందజేయాలని ప్లాంట్ సిసిఎం ఆర్.మహంతి కోరారు.

విశాఖలో భారీ వర్షం

గురువారం. నగరంలో గురువారం ఒక్కరోజే 50 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. విశాఖ నగర చుట్టుపక్కల ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతం మొత్తం కలిపితే 246 మిల్లీమీటర్ల వర్షపాతం ఒక్కరోజే నమోదు అయ్యింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 27 డిగ్రీలకు పడిపోయాయి. మొన్నటి వరకూ నగరం అంతటా ఎక్కడ చూసినా ప్రజానీకం ఎండలు, ఉక్కపోతతో తీవ్రంగా అల్లాడిపోయారు. వర్షాకాలంలో కూడా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నగరంలో నమోదైన విషయం తెలిసిందే.

విశాఖలో నారా లోకేష్ ప్రజాదర్బార్

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి లోకేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలో పర్యటిస్తున్న రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయన్ని స్వయంగా కలిసి ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వంలో దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరపాలని ఒక దళిత సంఘం నాయకుడు లోకేష్‌కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఎపి నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు విధానంలో డిఎంఇ, ఎపివివిపి, డిపిహెచ్, ఎన్‌హెచ్ఎం విభాగాలలో పనిచేస్తున్న నర్సులను రెగ్యులర్ చేయాలని, వంద శాతం గ్రాస్ జీతం అమలు చేయాలని, పరస్పర అంగీకార బదిలీలు అమలు చేయాలని, బీమా అందించాలని కోరారు. అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాల భూమిని వైసిపి నాయకుల అండతో ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్.నాగమణి, జి.జయలక్ష్మి కోరారు. డిఎస్సీ 2008 నోటిఫికేషన్‌లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని ఎపి తెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రష్యాలో వైద్య విద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్టీఆర్ విదేశీ విద్యాదీవెన, బిసి ఓవర్ సీస్ స్కాలర్ షిప్ మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే నెపంతో గత వైసిపి ప్రభుత్వం నిలిపివేసిన ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, గత వైసిపి ప్రభుత్వంలో దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ సుధాకర్ అంశం, వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం, కోడికత్తి శ్రీను, కిరణ్ కుమార్ హత్య వంటి కేసులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కోరారు.

జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కూటమి ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం జర్నలిస్టులకు ఉచితంగా 4 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని లోకేష్‌ను పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నాయని, అదే మాదిరిగా మన రాష్ట్రంలోనూ కల్పించాలని కోరారు. లోకేష్‌ను కలిసిన వారిలో లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఐజెయు సభ్యులు ఆర్.రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

బిల్డర్లపై భారం మోపొద్దు!

రాష్ట్ర వ్యాప్తంగా బిల్డర్లకు భారం పడేలా ఆగస్టు 20న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబర్ 1768902/హెచ్1/2024 ఉందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు బిల్డర్లు లోకేష్‌ను కోరారు. తణుకులో ఇటీవల వెలుగు చూసిన టిడిఆర్ కుంభకోణాన్ని వారంతా గుర్తు చేశారు. అక్కడి మున్సిపాలిటీ అధికారులు కూడా బిల్డర్లకు ఇబ్బంది పెట్టేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. లోకేష్‌ను కలిసిన వారిలో బిల్డర్లు పి.వి.ఆదినారాయణ, పి.వెంకటమణి, పృథ్వీ, చాందీ, దిలీప్ కుమార్ ఉన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

(మొదటి పేజీ తరువాయి..) ముక్తకంఠంతో అంగీకారం తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని, కర్మాగార పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, ఎజె.స్టాలిన్‌లు అందించిన ప్రతిపాదనల మేరకు జివిఎంసి టేబుల్ అజెండాలో ఎనిమిదో అంశంగా స్టీల్‌ప్లాంట్ విషయాన్ని చేర్చి గురువారం చర్చించారు. ఈ నెల 24న ప్రారంభమైన జివిఎంసి కౌన్సిల్ సమావేశం తొలి రెండు రోజులూ రసాభాసగా సాగినా మూడో రోజైన గురువారం మాత్రం అజెండాలోని పలు అంశాలతో ముందుకు సాగింది. అజెండాలోని అంశాలపై తమకు ఉన్న అనుమానాలను అధికారుల నుంచి కార్పొరేటర్లు నివృతి చేసుకున్నారు.

మూడు రోజుల సమావేశం.. జివిఎంసి చరిత్రలో రికార్డు

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జివిఎంసి కౌన్సిల్ సమావేశం ఈ నెల 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు సుదీర్ఘంగా కొనసాగింది. అందులో భాగంగా ప్రధాన అజెండాలో 48 అంశాలు, సప్లిమెంటరీ అజెండాలో 27 అంశాలు, టేబుల్ అజెండాలో 8 అంశాలు పొందుపరచగా సప్లిమెంటరీ అజెండాలోని 24వ అంశాన్ని సభ్యులు తిరస్కరించారు. టేబుల్ అజెండాలోని ఐదో అంశాన్ని సభ్యులు అభ్యర్థన మేరకు మేయర్ వాయిదా వేశారు. ప్రస్తుత కౌన్సిల్ ఏర్పాటై మూడున్నర సంవత్సరాలలో 98 వార్డుల సభ్యులకు తమ సమస్యలను చెప్పుకునేందుకు తొమ్మిది గంటల సుదీర్ఘ జీరో అవర్‌ను ఈ సమావేశాల్లో నిర్వహించారు. అంతేకాకుండా అజెండాలోని 83 అంశాలపై చర్చ జరగడంతో పెక్కు మంది సంతృప్తి చెందారు. అజెండాలో చర్చించిన వాటిలో అధిక శాతం ఉద్యోగుల జీతాలు, వ్యవధి ముగిసిన ఉద్యోగుల కొనసాగింపు, పరిపాలన సంబంధిత అంశాలు ఎక్కువగా ఉన్నాయి. సభ్యులు లేవనెత్తిన సమస్యల్లో ప్రధానంగా వీధిలైట్లు, పారిశుధ్య కార్మికుల కొరత, కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయి.

సమావేశం అనంతరం నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగిన సర్వసభ్య సమావేశంలో జీరో అవర్‌లో అందరు కౌన్సిల్ సభ్యులు వారి వారి వార్డుల్లో సమస్యలను కౌన్సిల్‌కు తెలియజేశారన్నారు. కౌన్సిల్ సభ్యులు వారి వార్డుల్లో తెలియపరిచిన సమస్యలకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కార దిశగా కార్యాచరణను చేపట్టాలని, అలాగే సభ్యులు అజెండాలలో పలు అంశాలను ఆమోదిస్తూ వాటిలో కొన్నింటిపై కోరిన వివరాలను కూడా సభ్యులకు అందించే ఏర్పాట్లు చేయాలని కమిషనర్‌ను ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

ఉక్కు తీర్మానంపై సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు హర్షం

సమావేశం అనంతరం సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని, ఈ క్రమంలో కౌన్సిల్ సమావేశంలో ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, అందుకు సిఎం సహా పలువురిని కలిసి మేయర్ ఆధ్వర్యంలో అన్ని పార్టీల వారు ఒక్కటై ఒత్తిడి తీసుకురావాలని ఏకగ్రీవ తీర్మానం చేశారని అన్నారు. సభ్యులందరికీ సిపిఎం ధన్యవాదాలు తెలియజేస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ లేని విశాఖను ఊహించజాలమన్నారు. అటువంటి పరిస్థితి రాకుండా ఉండటం కోసం కార్పొరేషన్‌లో ఉన్నటువంటి అన్ని పార్టీల కార్పొరేటర్లు కంకణబద్దులై ఉండాలన్నారు. గతంలో కూడా స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసిందని గుర్తుచేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం దేశ చరిత్రలోనే గొప్ప విషయమని పేర్కొన్నారు.

సిపిఐ ఫ్లోర్ లీడర్, 72వ వార్డు కార్పొరేటర్ స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ ఉక్కుపై కౌన్సిల్ తీర్మానంపై హర్షం వెలుబుచ్చారు. రానున్న రోజుల్లో మేయర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్టీల్‌ప్లాంట్ ప్రాముఖ్యతను, ఇక్కడి ప్రజల మనోభావాలను తెలియజేసేందుకు కృషి చేస్తామని అన్నారు

జివిఎంసిలో ఆర్థిక లావాదేవీలపై బేరసారాలు

ఆ రోజు కమిషనర్‌తో భేటీలో ఏం జరిగింది ?

కూటమి, వైసిపి కార్పొరేటర్ల లోగుట్టు మధ్య ఐక్యత అందుకేనా!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అవినీతిలో గడిచిన ఐదేళ్లలో ఆరితేరిన గ్రూపు ఒకటైతే... కొత్తగా అధికారం వచ్చాక వాటిలో తలదూర్చి లబ్ధిపొందాలనుకునే గ్రూపు మరొకటి. వాటిలో ఒక గ్రూపు వైసిపిది కాగా మరో గ్రూపు కూటమి పార్టీలది. తాజాగా జివిఎంసి కౌన్సిల్ సమావేశం మూడు రోజులపాటు ఎన్నడూ లేని విధంగా సా...గడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. రాష్ట్రంలో అధికారం కూటమికి దక్కినా నగర పాలక సంస్థ మాత్రం వైసిపి చేతిలో ఉంది. దీన్నెలాగైనా లాక్కునే ప్రయత్నాలు తొలుత కూటమి నేతలు చేసినా అది ఇప్పుడే సాధ్యం కాకపోవడంతో వారితో బేరసారాలకు దిగారన్న 'పబ్లిక్ టాక్' నడుస్తోంది. ఈ నెల 24న ప్రారంభమైన కౌన్సిల్ మూడు రోజుల పాటు జరిగింది. మొదటి రోజు వైసిపికి చెందిన మేయర్ గొలగాని హరివెంకట కుమారి టార్గెట్‌గా కూటమి కార్పొరేటర్లు నానా రభస చేశారు. ఆమె హయాంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆ తరువాత రెండు రోజులూ 'అవినీతి'పైనా, మేయర్ వ్యవహారంపైనా మాట్లాడకుండా ఉండిపోయారు. ఈ వ్యవహారంపై చర్చ జరుగుతోంది.

అసలేం జరిగింది ?

జివిఎంసి కౌన్సిల్ జరిగిన మొదటి రోజు రాత్రి కమిషనర్ కార్యాలయంలో ప్రధాన పార్టీల ఫ్లోర్ లీడర్లు, ముఖ్యమైన కార్పొరేటర్లతో జరిగిన భేటీతో ఒక అంగీకారానికి కార్పొరేటర్‌లు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. దీంట్లో ప్రధానమైనది.. నగరంలోని వేల సంఖ్యలోగల చికెన్ దుకాణాల వద్ద కోడి వ్యర్థాలపై ఒప్పందం. దీనిపై వైసిపికి చెందిన కొద్దిమంది కార్పొరేటర్లు రూ.లక్షలు అవినీతికి పాల్పడినట్లు తెలిసిందే. ఈ వ్యర్థాలను కాపులుప్పాడకు తరలించాల్సిన జివిఎంసిని అటు పోనివ్వకుండా కొద్దిమంది వైసిపి కార్పొరేటర్లు అడ్డం పడి గోదావరి జిల్లాల్లోగల రొయ్యల మేతకు తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకోవడం గతంలోనే వెలుగులోకి వచ్చింది. దీనిపై కూటమి కార్పొరేటర్లు ఎప్పటి నుంచో గుర్రుగా ఉన్నారు. అధికారం రావడంతో ఇలాంటి వ్యవహారాలను తెరపైకి తెచ్చి బేరసారాల్లో నిమగ్నమయ్యారు. వెరసి కూటమి, వైసిపి మధ్య అక్రమార్జన అంశంపై కౌన్సిల్ జరిగిన చివరి రెండు రోజులూ ఏకాభిప్రాయం కుదిరిందన్న చర్చ నడుస్తోంది.

వైసిపిని బోనులో పెడతామని వారే దూరారు

జివిఎంసిలో వైసిపి అవినీతిని బోనులో పెడతామని ప్రగల్భాలు పలికిన టిడిపి కూటమి కార్పొరేటర్లు ఆ రొంపిలోకే దూరడం తాజా పరిణామం. గంటల తరబడి ఈ బేరసారాల్లోనే వారంతా నిమగ్నమయ్యారు. అధికారులతో పాటు జివిఎంసిలో అత్యంత కీలకమైన వారు కార్పొరేటర్లే. గత వైసిపి హయాంలో ఇద్దరు ముగ్గురు కార్పొరేటర్లే ఒంటిచేత్తో ఈ వ్యవహారాలను నడిపి కార్పొరేషన్‌ను గుప్పెట్లో పెట్టుకున్నారన్న చర్చలు నేటికీ సాగుతున్నాయి.

మినీ అంగన్వాడీ కేంద్రాలను

మెయిన్ కేంద్రాలుగా మార్చండి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. గురువారం అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేపట్టారని, దీంతో సమ్మెలో ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతంలో అంగన్వాడీ సెంటర్లకు పప్పు, మంచి నూనె వంటి సరుకులు సకాలంలో అందలేదన్నారు. వేతనాలు కూడా పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. బాలామృతం ఇతర సరుకులు సెంటర్ వద్దకే చేర్చాలన్నారు.సరుకులు మండల కేంద్రం వద్ద ఉండటంతో అంగన్వాడీలు వందల రూపాయలు పెట్టి ఆటోల్లో సెంటర్‌కు తీసుకెళ్లడంతో అదనపు భారం పడుతుందని తెలిపారు. రిటైర్మెంట్ అయిన కొంతమంది అంగన్వాడీ సహాయకులకు 50 వేలు అందాల్సిన బెనిఫిట్స్ 30 వేలు అందుతున్నాయని తెలిపారు. అంగన్వాడి సెంటర్‌లకు ఇచ్చిన సెల్ ఫోన్లు సక్రమంగా పనిచేయక అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P.No. 4/2024

పిటీషన్:
యల్లపు జ్యోతి సంతోషి & వగైరాలు ... పిటీషనర్స్

అండ్:
నిల్ ... రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

పై నెంబరు కేసులో విల్లూరి సీతారామస్వామి నాయుడు మరియు అతని భార్య విల్లూరి నాగమణి చనిపోయిన కారణంగా వారికి చెందిన Voltas Pvt. Ltd. కంపెనీ షేర్లు, వారి కుమార్తెలైన 1.యల్లపు జ్యోతి సంతోషి 2. కాండ్రేగుల లక్ష్మీపార్వతి, 3. బొడ్డేడ లక్ష్మీకాంతం తీసుకొనుటకు సక్సెసన్ సర్టిఫికేట్ ఇప్పించమని కోరుచూ పై కేసు దాఖలు చేసియున్నారు. సదరు విషయంపై ఎవరికి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో **తేది: 30-9-2024దీన ఉదయం 10-30 ని॥లకు** మీరు పై కోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు పై కేసు తీర్మానించబడును.

వై.ఎస్.ఆదిత్య
అడ్వకేట్, అనకాపల్లి.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఆర్థికసాయం చేస్తున్న 'న్యూ లైఫ్' విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గొట్టిపల్లి గ్రామంలోని న్యూలైఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, న్యూలైఫ్ విద్యాసంస్థల వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున విజయవాడ, వయనాడ్ (కేరళ) వరద బాధితుల సహాయార్థం రూ.1.12లక్షల విరాళాలను అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు వరద బాధితుల కోసం నిధులు సేకరించడం అభినందించారు. సేకరించిన మొత్తాన్ని బాధితులకు పంపనున్నట్లు తెలిపారు. అందరికీ అందుబాటులో, అతి తక్కువ ఫీజులతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయ శ్యామ్, ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక, బొగ్గు వాహనాలపై టార్పాలిన్ కప్పాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ నగర పరిధిలో ఇసుక, బొగ్గు, ఇతర సరుకుల రవాణా వాహనాలపై టార్పాలిన్ కవర్‌తో కప్పాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రాజరత్నం తెలిపారు. టార్పాలిన్ కవర్ కప్పకుండా, సంబంధిత లోడుతో నగరంలోకి వాహనాలు ప్రవేశిస్తే రూ.11 వేలు జరిమానా, పర్మిట్ సస్పెన్షన్ చేస్తామని హెచ్చరించారు. వాహనాల్లోని బొగ్గు, ఇసుక లోడ్‌లపై టార్పాలిన్ కప్పకపోతే, వెనుక వచ్చే వాహనదారులకు ప్రమాదానికి గురికావడంతోపాటు పర్యావరణ కాలుష్యం ఉండే అవకాశం ఉందన్నారు.

రూరల్ ఎఇగా హరికుమార్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపిఇపిడిసిఎల్ భీమిలి సెక్షన్ ఆపరేషన్స్ రూరల్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా జి హరికుమార్ గురువారం చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఉద్యోగ భాధ్యతలు చేపట్టారు. కుర్మన్నపాలెం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎఇ రవికుమార్ అనకాపల్లి బదిలీపై వెళ్లారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

పారిశ్రామికవేత్తలు, సంస్థలకు జిల్లా కలెక్టర్ పిలుపు

కోరమండల్ సౌజన్యంతో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-గాజువాక: సామాజిక సేవలో పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు, ఇతర సంస్థలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ మోడల్ ఐటిఐలో మురుగప్ప గ్రూపు, కోరమండల ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యతగా సిఎస్ఆర్ నిధులు రూ.34లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత కలెక్టర్ పిలుపుమేరకు రూ.32లక్షల అంచనాతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు ముందుకొచ్చిన కోరమండల సంస్థ, వ్యయం మరో రూ.రెండు లక్షలు పెరిగినప్పటికీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కోరమండల్ స్ఫూర్తితో మరిన్ని సంస్థలు సామాజిక సేవకు ముందుకు రావాలన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కోరమాండల్ వైస్‌ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ ఎం.జ్ఞాన సుందరం, సిఎస్ఆర్ హెడ్ సి.జయ గోపాల్, హెచ్ఆర్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, ఐటిఐ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వి.రమణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, 65వ వార్డు కార్పొరేటర్ బి.నరసింహపాత్రుడు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కోరమండల్ కృషి అభినందనీయం

విద్యాభివృద్ధికి కోరమండల్ సంస్థ కృషి అభినందనీయమని గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

గాజువాక హైస్కూలులో మురుగప్ప గ్రూప్ కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ సామాజిక బాధ్యతగా ఏర్పాటు చేసిన సైన్స్ లేబొరేటరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, దానిలో కోరమండల్ వంటి సంస్థలు సహకరించడం ప్రశంసనీయమన్నారు.

కోరమండల్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో డిఇఒ చంద్రకళ కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞాన సుందరం, హెచ్ఆర్ డిజిఎం ఆర్.శ్రీనివాసరావు, సిఎస్ఆర్ హెడ్ సి.జయగోపాల్, డిప్యూటీ మేనేజర్ ఎస్ వెంకటరమణ, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బిఎన్ పాత్రుడు,కరణంరెడ్డి నరసింగ రావు, గూటూరు శంకరరావు, హెచ్ఎం విజయ ప్రశాంతి, పల్లా చినతల్లి పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎపిఎస్ఎస్‌డిసి, డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బిటెక్ తృతీయ ఏడాది విద్యార్థులకు ఎడబ్ల్యుఎస్ క్లౌడ్ కంప్యూటరింగ్‌పై వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. ఈ నెల 16 నుంచి 26 వరకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టాలని విద్యార్థులకు నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి బి సుమన, అవంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, సిఎస్ఇ విభాగాధిపతి శ్రీలక్ష్మి, ఎఐ అండ్ ఎంఎల్ అండ్ డేటా సెంటర్ కోఆర్డినేటర్ బి.గణేష్ పాల్గొన్నారు.

తిరుమల లడ్డూతో రాజకీయాలు దారుణం

ప్రజాశక్తి -ఆనందపురం:: తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలోవాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కల్తీ జరిగినట్లు అసత్య ప్రచారం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేయడం దారుణమని వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యనారాయణ అన్నారు. దీనిపై మాజీ సిఎం, వైసిపి అధినేత జగన్ ఆదేశాలతో ఈనెల 28న శనివారం బోయపాలెం, పైడా కళాశాలలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలునిర్వహిస్తామని, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ఇంటింటా కరపత్రాలను పంచుతున్న కార్పొరేటర్ హేమలత

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి -మధురవాడ : కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనపై గురువారం జివిఎంసి ఐదోవార్డులో ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి కరపత్రాలు పంపిణీచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన, పనితీరు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం, ఇచ్చిన హామీలను వివరించడంతోపాటు వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జివిఎంసి జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, వార్డు అధ్యక్షులు సత్యనారాయణ, జనసేన అధ్యక్షులు దేవర శివ, సెక్రటరీ ఈగల రవి, పాల్గొన్నారు.

వేపగుంట : జివిఎంసి 94వవార్డు వేపగుంటలోని జివిఎంసి కళ్యాణ మండపంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో పింఛన్ల పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, ఉపాధికి బడ్జెట్ పెంపు, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డిఎస్‌సి ఇలా ఎన్నో హామీలను నెరవేర్చారన్నారు. విజయవాడ వరద విలయ బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వంలోని అధికారులు, నేతలు, అన్నివర్గాల ప్రజలు బాధితులకు బాసటగానిలిచారన్నారు. త్వరలో రైల్వేజోన్, ఉచిత గ్యాస్ అమలు కానున్నాయన్నారు. స్పెషల్ ఆఫీసర్ శేష శైలజ, కూటమి నేతలు శోభారాణి, నాగరాజు పాల్గొన్నారు

సీతమ్మధార :జివిఎంసి 44 వార్డులో షాదీఖానా కల్యాణ మండపంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పాల్గొని, 100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో జోన్ 3 కమిషనర్ శివప్రసాద్ ఉపాకిరణ్, కార్పొరేటర్లు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. జివిఎంసి 25వ వార్డు గణేష్‌నగర్‌లో టిడిపి కార్పొరేటర్ సారిపల్లి గోవింద ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించడంతోపాటు వైసిపి వైఫల్యాలను ఎండగట్టారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నజీర్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి రెండోవ ఆర్డు ఆదర్శనగర్ సచివాలయంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమప్రసన్న వాణి, మాజీ కౌన్సిలర్లు బడిగింటి నీలకంఠం, పిట్ట వెంకటరావు, తెలుగు మహిళ నాయకులు రిక్క సత్య పాల్గొన్నారు. ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆనందపురం : మండలంలోని తర్లువాడ పంచాయతీలో సర్పంచ్ బిఆర్‌బి నాయుడు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం పేరుతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంచారు. 100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వ విజయాలు, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తాత్రాజు అప్పారావు, పిల్లా చిన్నారావు పాల్గొన్నారు.

మాధవధార : మాధవధారలోని మాధవస్వామి కళ్యాణ మండపంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు. వందరోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యతా క్రమంలో కృషి చేశామన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్న జివిఎంసి సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము,శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్, వార్డు టిడిపి అధ్యక్షులు ససపల వరప్రసాద్, కీర్తి, తమ్మినేని పద్మజ, తమ్మినేని లోహితరావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని తోటాడ త్రిమూర్తులు గుడి వద్ద గురువారం టిడిపి, జనసేన మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం ఆధ్వర్యాన ఇది మంచి ప్రభుత్వం ముగింపు సభ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి మల్ల జయలక్ష్మి, నాయకులు పోలమరశెట్టి మురళి, దొడ్డి రమేష్, ఆళ్ల వెంకటేష్, ఆడారి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ దాడి శ్రీను, మాజీ సర్పంచ్ దాడి వీర మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పలుచోట్ల మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో గురువారం ఓ ఇంటి వద్ద 25 మద్యం బాటిళ్లను అక్రమంగా నిల్వ ఉంచడంతో స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ, అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గొలుగొండ: మండలంలో ఏఎల్ పురంలో కొంగసింగి జంక్షన్ వద్ద బెల్ట్ షాప్‌కు మద్య సీసాలు తరలిస్తున్న చింతల రమణ అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నామని కేడీపేట ఎస్సై టి దివ్య తెలిపారు. అక్రమంగా బెల్టు షాపుకు తరలిస్తున్న 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని చోద్యం గ్రామానికి చెందిన చింతల రమణపై కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు.చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించే వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని బవులవాడ గ్రామంలో విద్యుత్ షాక్‌తో గ్రామానికి చెందిన ఆర్ఇసిఎస్ హెల్పర్ బాలవు నాగసూరి అప్పారావుకు చెందిన గేదె మృతి చెందింది.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు

అల్లుపేటలో మూడు పూరిళ్లు దగ్ధం

కృష్ణాకాలనీలో రెండు దుకాణాలు ఆహుతి

రెండు ప్రమాదాల్లో రూ 5.90 లక్షల ఆస్తి నష్టం

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన దుకాణం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు కృష్ణాకాలనీలో బుధవారం అర్ధరాత్రి దాటాక సుమారు 2 గంటల సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ 5లక్షలు ఆస్తి నష్టం జరిగింది. చిట్టివలస అగ్నిమాపక శాఖ హెడ్‌కానిస్టేబుల్ జి శివకుమార్‌రెడ్డి అందించిన వివరాల ప్రకారం, కృష్ణా కాలనీలో వియ్యపు తౌడుకు చెందిన పాన్ షాప్, పీతల వెంకటరావుకు చెందిన టైలరింగ్ దుకాణం దగ్ధమయ్యాయి.ఈ ప్రమాదంలో రూ 90 వేలు ఆస్తి నష్టం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా భావిస్తున్నారు. అగ్ని ప్రమాద బాధితులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటామనిహామీ ఇచ్చారు

తగరపువలస : భీమిలి మండలం, దాకమర్రి పంచాయితీ అల్లుపేటలో గురు వారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అల్లు ముత్యాలు, అప్పన్న, లక్ష్మణ అన్నదమ్ములకు చెందిన మూడు పూరిళ్లు వరుసగా ఉండగా ఇక్కడ షార్ట్‌సర్క్యూట్‌తోనే అగ్నిప్రమాదం చోటుచేసుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ 5 లక్షలు ఆస్తి నష్టం జరిగింది. ప్రమాదంలో వంట గ్యాస్ సిలెండర్లు, కరెంట్ మీటర్లు, కొంత నగదు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు.

అసైన్‌మెంట్, ఫుడ్ కమిటీలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : అసైన్‌మెంట్, ఫుడ్ కమిటీలను పునరుద్ధరించాలని కమిటీ మాజీ సభ్యుడు కిలాని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ఎమ్మెల్యే చైర్మన్‌గా ఆర్‌డిఒ కన్వీనర్‌గా ఉండే ఫుడ్ కమిటీ పర్యవేక్షించేదన్నారు. ఇందులో సభ్యులుగా ఎంపిపి, జెడ్‌పిటిసిలతోపాటు కొందరు అధికారులు, ఇతర ప్రతినిధులు వుండే వారన్నారు. మండలాల వారీగా ఈ కమిటీలు ఉండేవన్నారు.

అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1990 నుంచి 1997 వరకు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యే చైర్మన్‌గా, ఆర్‌డిఒ కన్వీనర్‌గా అసైన్‌మెంట్ కమిటీలు ఉండేవని, వీటిల్లో అధికారులతోపాటు రాజకీయపార్టీల ప్రతినిధులు సభ్యులుగా ఉండేవారన్నారు. ఆయా నియోజకవర్గాల్లోభూముల కేటాయింపు, అర్హులకు భూపట్టాల పంపిణీ, కాలనీల ఏర్పాటు వంటి ప్రక్రియలు అసైన్‌మెంట్ కమిటీల ఆమోదంతోనే జరిగేవన్నారు. ఇప్పటికైనా మండలాలవారీగా అసైన్‌మెంట్, ఫుడ్ కమిటీల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

ఇసుక కొరతపై నిరసన

నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇసుక కొరతతో కొన్నాళ్లుగా పనిలేక కుటుంబపోషణకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని సిఐటియు ఆధ్వర్యంలో గురువారం రవీంద్రనగర్‌లో భవన నిర్మాణ కార్మికులు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సిఐటియు ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అవసరమైన ఇసుకను అందించకపోగా, గతంలో కంటే రెట్టింపు ధరకు అమ్మే పరిస్థితి తెచ్చిందన్నారు. దీంతో ఇటు భవన నిర్మాణ కార్మికులే కాక, యజమానులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ రవీంద్రనగర్ కూడలిలో రోజూ 200 మంది భవన నిర్మాణ కార్మికులు పనికోసం వస్తే వారిలో 10 మందికి కూడా పని దొరకడం లేదన్నారు. జి.నాగరాజు, సి.హెచ్. రాము, కె.సన్యాసమ్మ, ఎన్.సూర్యనారాయణ, ఎస్.కె.వలీ, శ్రీను పాల్గొన్నారు.

30న మహాధర్నాను జయప్రదం చేయండి

విమ్స్ శానిటరీ వర్కర్స్, మున్సిపల్ కార్మికుల ఆందోళన

ఆందోళన చేస్తున్న విమ్స్ శానిటరీ వర్కర్స్

ప్రజాశక్తి - ఆరిలోవ : సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం చెల్లింపు, రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శానిటరీ కార్మికులు గురువారం విమ్స్ ఆసుపత్రి వద్ద ఆందోళన చేసారు. ఈ నెల 30న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా పోరాడి, హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. మహాధర్నాలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విమ్స్ ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డి.రాజేశ్వరి, వై.కనకరాజు, అన్నపూర్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ములగాడ : కాంట్రాక్టు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్ లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 58,59, 60 వార్డుల్లో ఈనెల 30 జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఆప్కాస్‌లో పర్మినెంట్ అనే పదం తొలగించి, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జోన్ అధ్యక్షులు కె.రమణ జోన్ నాయకులు బి రాంబాబు, డి.రాము, బి.సూరిబాబు తిరుపతిరావు, ఆదినారాయణ, డి.రాజు రైలుబాబు, ఎస్ లక్ష్మి, రమణమ్మ, సిహెచ్.లక్ష్మి, సీత, దుర్గ, శ్యామల సింహాచలం, శ్రీను పాల్గొన్నారు.

ఆందోళనలో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించండి

ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం ఇస్తున్న కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- వేపగుంట : పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంచగ్రామాల కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు గురువారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే పంచకర్ల స్పందిస్తూ, పంచగ్రామాల భూసమస్యపై ఎన్నికల్లో ఇచ్చిన హామీకి తాము కట్టుబడి ఉన్నామని, దీనిపై ఇప్పటికే విజయవాడలో సంబంధిత అధికారులతో చర్చించామన్నారు.దీనికి సంబంధించి కోర్టులో ఉన్న కేసుపై అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి, త్వరితగతిన వాయిదాల్లో ప్రభుత్వ వాదనలు వినిపించి, సమస్య కొలిక్కి వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈలోగా పంచ గ్రామాలలోని కూటమి కార్పొరేటర్లు, కాలనీ అసోసియేషన్లతో సమావేశం నిర్వహించి, సమస్యపై పూర్తి వివరాలను తెలుసుకుంటానని హామీనిచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం, పంచ గ్రామాల భూసమస్య పరిష్కార కమిటీ కార్యదర్శి టివి కృష్ణంరాజు, ఉపాధ్యక్షులు బిబిఎన్ ప్రతాప్, బి.రమణి, పి.రామారావు, కార్యదర్శులు బి శంకరరావు, బి ప్రకాష్, వేపగుంట నేతలు ముత్తా అప్పలరాజు, కాలనీ నాయకులు జివి కృష్ణారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

30న వికలాంగులు, మహిళలకు జాబ్‌మేళా

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎడి, ఎంప్లాయ్‌మెంట్ అధికారి

ప్రజాశక్తి- గాజువాక: ఈనెల 30న, సోమవారం పెదగంట్యాడ గొడ్డువానిపాలెం కల్చర్ ఫౌండేషన్ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని మహిళలు, వికలాంగులకు ప్రత్యేకంగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కల్చర్ ఫౌండేషన్ అధ్యక్షులు పేర్ల అప్పారావు తెలిపారు. గురువారం విశాఖపట్నం దివ్యకళామేళాలో దీనికి సంబంధించిన కరపత్రాలను వికలాంగుల సంక్షేమశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సుబ్బిరెడ్డి ఆవిష్కరించారు.

ఈసందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, ఈ జాబ్‌మేళాలకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని 18- 35 ఏళ్ల వయసు కలిగి, కనీసం 10వ తరగతి పూర్తిచేసిన వికలాంగులు, అలాగే 18 - 28ఏళ్ల మహిళలు ప్రత్యక్షంగా జాబ్‌మేళాకు హాజరు కావచ్చునని తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణలో ప్రభుత్వ వికలాంగుల ఐటిఐ ప్రిన్సిపాల్ భాస్కరరావు, ఎయు ప్రొఫెసర్, కల్చర్ ఫౌండేషన్ ట్రైనర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి -తగరపువలస: జివిఎంసి ఒకటో వార్డు సంతపేట ఎన్‌టిఆర్ పార్కు ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంలో సెక్టారు స్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, ఆకుకూరలు, పప్పు దినుసులు, అంగన్వాడీ కేంద్రం ద్వారా అందజేసే పాలు, గుడ్లు, బాలామృతం తదితరాలు ప్రదర్శించారు. వాటి ఉపయోగాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సిడిపిఒ శ్రీదేవి, సెక్టార్ సూపర్‌వైజర్ కె.ప్రమీల, 29 మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఎఎన్‌ఎంలు, జివిఎంసి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఎన్ఎస్‌టిఎల్‌లో స్వచ్ఛతా హీ సేవా

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్‌టిఎల్ సిబ్బంది

ప్రజాశక్తి -కరాస :గాంధీ మహాత్ముని స్ఫూర్తితో స్వచ్ఛభారత్ సాకారం దిశగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాల్లో గురువారం ఎన్ఎస్‌టిఎల్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ ఆదేశాలతో ఎన్ఎస్‌టిఎల్‌లో శ్రమదానంతో పరిసరాలను పరిశుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవపై అవగాహనకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్లు అందజేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్‌వి సత్య శ్రీనివాస్, మితిలేష్ కుమార్ సాహూ, రాహుల్ దీక్షిత్, సిబ్బంది, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎల్ఎం బృందానికి సహకరించాలి : జెసి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాకు విచ్చేసిన జాతీయ స్థాయి పర్యవేక్షణ(ఎన్ఎల్ఎం) బృందానికి సహకరించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్ఎల్ఎం బృంద సభ్యుల క్షేత్ర స్థాయి పర్యటనపై గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, డ్వామా, ఎంపిడిఒలు, సంబంధిత అధికారులతో జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీల స్థాయిలో అమలయ్యే కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుపై బృందానికి వివరించాలన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నియమించిన పూణే ఎఫ్ఎఆర్ఎం నియమించిన ఎన్ఎల్ఎం బృందంలో అనిల్ నింభోర్కర్, అనిల్ గైక్వాడ్ జిల్లాలో రోజుకు రెండు పంచాయితీలు చొప్పున ఐదు రోజులపాటు క్షేత్ర స్థాయిలో పర్యటించి, లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలుతీరును తెలుసుకుంటారన్నారు. దిశా కమిటీలను పర్యవేక్షిస్తారన్నారు.

ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుని జెసి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి ఎంఎస్.శోభారాణి, జెడ్‌పి సిఇఒ డి.సత్యనారాయణ, డిపిఒ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు, ఎల్‌డిఎం ఎం.శ్రీనివాస్, ఎస్‌బిఐ ఆర్‌సెటి డైరెక్టర్ బి.విజయకుమార్, డ్వామా ఎపిడిలు కె.ఉషారాణి, కె.ఆంజనేయులు, ఎంపిడిఒలు ఎం.విజయకుమార్, హనుమంతరావు, కె.వెంకయ్య పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని పాలవలస, పందలపాక, చందక, పేకేరు, గొట్టిపల్లి, గిడిజాల, కోలవానిపాలెం, మామిడిలోవ, తంగుడుపల్లి తదితర గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూముల్లోని లేఅవుట్లను విశాఖ ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ గురువారం పరిశీలించారు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ ఆదేశాలతో ఆయా సచివాలయాల పరిధిలోని ఫ్రీహోల్డ్ భూములను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ముందుగా గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. తర్వాత ఆయా గ్రామాల్లో సంబంధిత రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూముల సేకరణలో రైతుల సమ్మతితోనే జరిగిందా? లేక ఒత్తిడి చేసి తీసుకున్నారా? అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసైన్డ్ భూములున్న రైతుల వివరాలపై ఆరా తీశారు. పాలవలస సచివాలయ పరిధిలో భూరికార్డుల పరిశీలన జరిపి, నేరుగా రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, విఆర్‌ఒలు శ్రీనివాసరావు, స్వామి, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్

ఐఐహెచ్‌తో దృష్టి వైకల్యం రావొచ్చు

ఐఐహెచ్ రోగ నిర్ధారణ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : చికిత్స చేయకుండా నిర్లక్ష్యం చేసిన ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ (ఐఐహెచ్)తో పునరుద్ధరించలేని దృష్టి హాని, సంబంధిత ఇతర రుగ్మతలకు దారితీయవచ్చని ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రముఖ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ్ అన్నారు. గురువారం ఆసుపత్రి సమావేశ మందిరంలో ఐఐహెచ్‌పై వర్చువల్ కార్యక్రమం నిర్వహించారు. న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కె.వెంటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సచ్‌దేవ్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా తలనొప్పిలతో బాధపడుతున్న వారు ఐఐహెచ్‌ను నిర్ధారించేందుకు న్యూరాలజిస్ట్‌ను గానీ, న్యూరో ఆప్తమాలజిస్ట్‌ను గానీ సంప్రదించాలన్నారు. సకాలంలో రోగనిర్ధారణ చేసుకొని తగిన చికిత్సతో ఐఐహెచ్‌ను నివారించుకోవచ్చన్నారు. ముఖ్యంగా గర్భధారణకు అవకాశమున్న 20 నుంచి 50ఏళ్ల వయస్సున్న మహిళల్లోనూ, ఊబకాయం, కంటి నరాల సమస్యలున్న వ్యక్తుల్లో ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

అందరి సహకారంతోనే

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ సాధ్యం

- హై లెవెల్ కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా
- ఫార్మా ప్రమాదాలపై కమిటీ పరిశీలన

ప్రమాదం జరిగిన పరిశ్రమల్లో పరిశీలిస్తున్న హై లెవెల్ కమిటీ చైర్‌పర్సన్, సభ్యులు

ప్రజాశక్తి-పరవాడ

పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు అందరి సహకారం, నిర్దిష్ట పరీక్షల నిర్వాహణలో భాగస్వామ్యం అవసరమనిఫార్మా ప్రమాదాలపై ప్రభుత్వం నియమించిన హైలెవెల్ కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా అన్నారు. ఈ మేరకు కమిటీ చైర్‌పర్సన్‌తో పాటు కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా ప్రమాద ఘటనాస్థలాన్ని, పరవాడ ఫార్మాసిటీలోని సినర్జీన్ యాక్టివ్ ఇన్గ్రేడియంట్స్ సంస్థ యూనిట్-3లో జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొదటగా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా ప్రమాద ఘటనాస్థలాన్ని పరిశీలించి అనంతరం లారస్ ల్యాబ్స్ యూనిట్-2లో ఉన్న సమావేశ మందిరంలో వివిధ విభాగాల ఉన్నత అధికారులు, ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రమాదంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదానికి గల కారణాలను, చోటుచేసుకున్న వైఫల్యాలను అధికారులు శాఖల వారీగా వివరించారు. అనంతరం వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై వారి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. అందరి సూచనలు, సలహాలు స్వీకరించటానికి ఈ-మెయిల్ ఐడి, వాట్సప్ గ్రూప్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కమిటీ కన్వీనర్‌ను చైర్‌పర్సన్ వసుధా మిశ్రా ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీ రిపోర్టులో మంచి సూచనలను తప్పకుండా పొందుపరుస్తామని తెలిపారు.

రెండో పూట పరవాడ ఫార్మాసిటీలోని సినర్జీన్ యాక్టివ్ ఇన్గ్రేడియంట్స్ సంస్థ యూనిట్-3లో జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వివిధ పరిశ్రమల ప్రతినిధులతో విశాఖ ఫార్మా లిమిటెడ్ సమావేశ మందిరంలో సమావేశమై వారి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ పరిశ్రమల పరిరక్షణకు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నుండి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హై లెవెల్ కమిటీ కన్వీనర్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ వర్మ, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎవి పటేల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ బోయిలర్స్ ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ రాఘవన్ (ఐఐటి చెన్నై), ఆర్డీవో చిన్నికృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరి ప్రసాద్, జిఎం ఇండస్ట్రీస్ శ్రీధర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫార్మా డీలో వడ్డాది విద్యార్థికి గోల్డ్ మెడల్

గోల్డ్ మెడల్‌తో హేమలత

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన ఎర్ర హేమలత ఫార్మా డీలో గోల్డ్ మెడల్ సాధించింది. ఎర్ర రాము దేవి దంపతుల ప్రథమ కుమార్తె హేమలత కాకినాడ కాలేజీలో ఫార్మా డీ కోర్సు పూర్తి చేసింది. కష్టపడి చదివి మంచి మార్కులతో గోల్డ్ మెడల్ సాధించింది. కాలేజీలో 133 మంది విద్యార్థులలో ఇద్దరికి గోల్డ్ మెడల్ వచ్చినట్లు విద్యార్థిని హేమలత తెలిపారు. హేమలత తండ్రి శిల్పిగా పనిచేస్తూ తన కుమార్తెను చదివించారు. గోల్డ్ మెడల్ సాధించిన హేమలతను స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

వర్షం పడితే చెరువును తలపిస్తున్న పోలీస్ స్టేషన్

ప్రజాశక్తి-సబ్బవరం : బుధ, గురువారాల్లో పడిన వర్షాలకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నీటి ముంపునకు గురై చెరువులా మారింది. దీంతో పోలీస్ స్టేషన్ ముందు నుండి శివాలయం వరకు రోడ్డుపై నీరు నిలిచి ఉండడంతో వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కురిసినప్పుడు డ్రైనేజీ వ్యవస్థ, వీధి కాలువలు సరిగాలేకపోవడంతో మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీ నుండి సబ్బవరం సెంటర్ వరకు వరద నీరు రోడ్డుపై నుండి ప్రవహించి తిన్నగా పోలీస్ స్టేషన్లోకి చేరుతోంది. దీంతో పోలీసు స్టేషన్ ముంపునకు గురవుతుంది. ఈ విషయాన్ని పలు దిన పత్రికలలో పలు మార్లు ప్రచురించినా, ఇటు పంచాయితీ అధికారులుగాని, అటు ప్రజాప్రతినిధులు గాని చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రేమ సమాజానికి వితరణ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణానికి చెందిన దేవరకొండ సత్యవతి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు స్థానిక ప్రేమ సమాజం స్టీల్‌పాత్రలను అందించారు. ప్రేమ సమాజంలోని వృద్ధులు, స్త్రీలు, వికలాంగులు, పిల్లలకు అన్నదానం చేశారు. వారందరికీ బట్టల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రేమసమాజం ప్రెసిడెంట్ పూసర్ల రామారావు, సత్యవతి భర్త దేవరకొండ సుబ్బారావు, ఆమె కుటుంబీకులు, అల్లుళ్ల, స్నేహితులు, వింజమూరి శేష మణి రామకృష్ణ, దేవరకొండ వీర వెంకటి రమణి, అక్కినపల్లి వెంకట జగన్నాథ్ రావు, దేవరపల్లి వీర రామభాస్కర ఫణి నవకుమార్, పసనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉజ్వల భవిత

ప్రజాశక్తి-అనకాపల్లి : నైపుణ్యాభివృద్ధి ద్వారా మాత్రమే విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందగలరని విశాఖ స్టీల్ ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్ డి రామ్‌ప్రసాద్ అన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం పారడే మెమోరియల్ డే ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్‌ప్రసాద్ విద్యార్థుల సాంకేతిక పరిశోధనల సమాహారంగా "ఇన్నోవేటివ్ ఐడియాస్23కె- 24 పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ గోపాలమ్మ విద్యార్థులు డైట్ రీసెర్చ్ అండ్ అవుట్ రీచ్ ప్రోగ్రాం ద్వారా చేసిన పరిశోధనల గురించి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను గమనించాలన్నారు. సాంకేతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి వివిధ విభాగాధిపతులు, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారడేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని జంపపాలెం హైస్కూలు విద్యార్థులకు గురువారం ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు ఎవిఎస్ శాస్త్రి తెలిపారు. ఈ స్టడీ మెటీరియల్‌కు వింగ్స్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసినట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ నిర్వహించిన పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.12వేలు ఉపకార వేతనం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.ఆనంద్, ప్రధాన కార్యదర్శి ఎం జయప్రకాష్ ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, రమణ అప్పలనాయుడు, కృష్ణారావు, సుధాకర్, శ్రీనివాసు, ఎస్ఎంసి చైర్మన్ జగ్గారావు పాల్గొన్నారు.

'మన ఇల్లు-మన గౌరవం' సదస్సులను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఎ.ఎ.సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన లే-అవుట్లలో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో సదస్సులు నిర్వహించి నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ డి.రమేష్ బాబు, ఈఓపీఆర్డీఓ పివివిఎస్.ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి ఎస్.అప్పలరాజు, మండలం ఇంజనీరింగ్ అధికారి బాలాజీ అప్పారావు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ డిటి.నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఈనెల 28వ జరుగు మన ఇల్లు- మన గౌరవం గ్రామసభను విజయవంతం చేయాలని ఎంపీడీవో వి విజయలక్ష్మి ఆదేశించారు. ఈ గ్రామసభల్లో హౌసింగ్ లబ్ధిదారుల వివరాలు వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలను సేకరించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, వివిధ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది

సమయపాలన పాటించలేదని నిరసన

సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న యువకులు

ప్రజాశక్తి వడ్డాది

బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి శివారు బుదిరెడ్డపాలెం గ్రామంలో ఉన్న గ్రామ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని, నచ్చినప్పుడు విధులకు వస్తున్నారని, లేకపోతే లేదని స్థానిక యువకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం సచివాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక యువత మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో పారిశుద్ధ్య కార్మికుడు తలుపులు తాళాలు తీసి గంటసేపు కూర్చొని వెళ్ళిపోతున్నాడని, సిబ్బంది రావడం లేదని, దీనిపై పంచాయతీ కార్యదర్శి కూడా పట్టించుకోని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. సచివాలయం వుండేది ఒక్క చోట అయితే సిబ్బంది ఫోన్ పట్టుకొని ఆడుకునేది మరో చోట అని పేర్కొన్నారు. గ్రామంలో యువత పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి సచివాలయానికి ఎందుకు రాలేదని అడిగితే సిగ్నల్ లేదని, అందుకే రాలేదని చెప్పినట్లు తెలిపారు. స్థానిక యువత డబ్బులు కూడుకొని ఫైబర్ నెట్ వేయించామని, అయినా కూడా సచివాలయ సిబ్బంది రావడం లేదని ఆరోపించారు. గ్రామంలో చాలా మంది సచివాలయంలో తమ పనులు కాక ఇబ్బంది పడుతున్నారన్నారు. మొటూరు గోవింద, యన్నంశెట్టి సన్యాసినాయుడు, మొటూరు బాలాజీ, గండెం చిన్నారి తదితరులు గత పది రోజులుగా ఓబీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నా సచివాలయ సిబ్బంది పట్టించుకోలేని లేదని, కనీసం ఫోన్‌కి సమాధానం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై, ప్రజల పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేడు బుద్ధిస్ట్ డెస్టినేషన్ లైట్, సౌండ్ షో ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27న అనకాపల్లి బొజ్జన్నకొండ బుద్ధిస్ట్ డెస్టినేషన్ లైట్, సౌండ్ షోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్‌గా ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన బొజ్జన్న కొండ చాలా ఆహ్లాదకరమైన ప్రాంతమని, విశిష్టత కలిగి ఉన్నదని, అటువంటి ప్రదేశాన్ని మరింత పర్యాటక ప్రాంతంగా రూపు దిద్దేందుకు టూరిస్ట్ అమినిటీ సెంటర్, లైట్ అండ్ సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దేశంలో అత్యంత విలువైన వారసత్వ నిర్మాణాల్లో నేటికీ చెక్కుచెదరక నిలిచిన ఈ ప్రదేశం ఓ ముఖ్యమైన పర్యాటక గమ్యస్థానం అని కలెక్టర్ విజయ తెలిపారు.

నాగభూషణం హర్షం

లేజర్ థియేటర్లను శుక్రవారం ప్రారంభిస్తుండడం పట్ల సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగ భూషణం గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో బొజ్జన్న కొండ అభివృద్ధి చెందాలని పలు బౌద్ధ సంఘాలతో సుమారు 20 సంవత్సరాలుగా పలు రకాల విజ్ఞాపనలు, నిరసనలు తెలిపినట్లు గుర్తు చేశారు. ఈనేపథ్యంలో నేడు బొజ్జన్న కొండను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయడం శుభసూచికమన్నారు.

రైతుల సమస్యలపై తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి- కె.కోటపాడు

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతాంగానికి పెట్టుబడి సాయం కింద ప్రకటించిన రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని, 2023 ఏడాది ఖరీఫ్ పంట బీమా పరిహారం చెల్లించాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మెటల్ బిగించడానికి ఇచ్చిన జీవో నెంబరు 22 రద్దు చేయాలని, కౌలు రైతులకు భూస్వాములతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలని. ఇటీవల జరిగిన రీ సర్వేలో తప్పులు సరిచేసి వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని. దేవాదాయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఏరియా కార్యదర్శి వనము సూర్యనారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు రొంగలి ముత్యాలనాయుడు, బొడ్డేడ సన్యాసినాయుడు, రైతులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పిడుగు పాటుకు రైతు మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని కొత్తపెంట గ్రామంలో గురువారం ఉదయం పిడుగు పడి ఆ గ్రామానికి చెందిన రైతు సూరెడ్డి అప్పలనాయుడు (38) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... కొత్తపెంటకు సూరెడ్డి అప్పలనాయుడు గురువారం ఉదయం పొలంలోకి గడ్డి కోసం వెళ్లారు. గడ్డిమోపు మోసుకుని వస్తుండగా అదే సమయంలో అతనిపై పిడుగు పడటంతో అప్పలనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఏడేళ్ల కుమారుడు వరుణ్ ఉన్నారు. పశువుల మేత కోసం వెళ్లిన తన భర్త ఆకస్మిక మరణంతో మృతుడి భార్య కుమారి బోరున విలపించింది. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

అప్పలనాయుడు మృతదేహం

తుమ్మపాలలో గేదె మృతి

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో గురువారం పిడుగు పడి తుమ్మపాల గవరపేట వీధి శివాలయం ప్రాంతానికి చెందిన కొణతాల శ్యామ్‌కు చెందిన ఆవు మృతి చెందింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

చక్కెర కర్మాగారంపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

ప్రజాశక్తి- కె.కోటపాడు : జిల్లాలో తలమానికంగా ఉన్న గోవాడ చక్కెర కర్మాగారం రోజురోజుకు తన ఉనికిని కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ ఫ్యాక్టరీ పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోవాడ చక్కెర ఫ్యాక్టరీ పూర్తిగా నష్టాల బాటలో పయనించడానికి ఇందుకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. గతంలో ప్రతి క్రషింగ్ సీజన్లో సుమారు 5 లక్షల టన్నులు గానుగాట జరిపే ఫ్యాక్టరీ నేడు లక్ష టన్నులకు పడిపోయిందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకువస్తామని ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

మహాజన సభలో గిట్టుబాటు ధరపై ప్రస్తావన

ప్రజాశక్తి-చోడవరం : ఈనెల 28వ తేదీన జరుగు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజనసభలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించే అంశాన్ని ప్రస్తావిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు అన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గత ఆరేళ్ల క్రితం వరకు ఏడాదికి 5లక్షల టన్నులకు పైగా క్రషింగ్ చేస్తూ, రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా ఉండేదని గుర్తు చేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశానుసారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలతో నేడు పంచదార నిల్వలు పేరుకుపోయాయని, దీనికి తోడు ఫ్యాక్టరీ పాలక వర్గాల అవినీతి, అక్రమాలు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నేడు ఫ్యాక్టరీ నష్టాల్లోకి వెళ్లిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేరా జగదీశ్వరరావు, గొర్లె రాజు, అయిలిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

స్వయం కృషితో మహిళలు ఎదగాలి

ప్రజాశక్తి-యలమంచిలి : స్వయం కృషితో మహిళలు ఎదిగినప్పుడే మహిళా సాధికారత చేకూరుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. స్థానిక ధర్మవరం కనకమహాలక్ష్మి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వతంత్రంగా ఎదగాలన్నారు. అనంతరం 250 అర్బన్ స్వయం సహాయక గ్రూపులకు రూ.19 కోట్ల 5 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె నానాజీ, కొఠారు నరేశ్, సత్యనారాయణ, కొఠారు సాంబశివరావు, మెప్మా పద్మావతి పాల్గొన్నారు.



డ్వాక్రా గ్రూపులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

వేర్వేరు చోట్ల 84 కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-కె.కోటపాడు

కె.కోటపాడు, బుచ్చయ్యపేట మండలాల్లో పోలీసులు 84 కేజీల గంజాయిని పట్టుకొని, నలుగురిని అరెస్టు చేశారు. కారులో రవాణా చేస్తున్న 78 కేజీల గంజాయిని కె.కోటపాడు మండలంలోని బత్తివానిపాలెం జంక్షన్‌లో బుధవారం సాయంత్రం కె.కోటపాడు పోలీసులు పట్టుకున్నారు. కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపిన వివరాల ప్రకారం... చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన దేవానంద్, ఒరిస్సా రాష్ట్రం మల్కన్ గిరి జిల్లాకు చెందిన మహిళ సుపారిం మండల్ కారులో గంజాయిని రవాణా చేస్తుండగా బుధవారం సాయంత్రం మండలంలోని బత్తివానిపాలెం జంక్షన్‌లో పోలీసులు పట్టుకున్నారు. కారులో ఉన్న సుమారు 78 కిలోల గంజాయిని, కారును, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ సుమారు నాలుగు లక్షల రూపాయలు ఉంటుంది. నిందితులపై కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గంజాయితో కె.కోటపాడు పోలీసులు

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామం వద్ద బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై రవాణా చేస్తున్న 6 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు బుచ్చయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పట్టుబడిన ఆరు కేజీల గంజాయిని, ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. గంజాయి తరలిస్తున్న కృష్ణా జిల్లా బంటుమిల్లి గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు భవన్‌లోని కీర్తిశేషులు పీరాట్ల నరసింహమూర్తి వెంకటరమణమ్మ దంపతుల మినీ ఫంక్షన్ హాల్లో గురువారంలో 340 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు పుస్తకాలు చొప్పున 1700 పుస్తకాలను పంపిణీ చేశారు. వీటిని అనకాపల్లి టౌన్ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబానికి చెందిన నరసింహమూర్తి 2006లో 2000 రూపాయలతో ప్రారంభించిన శాశ్వత విద్యానిధి నేడు నాలుగు లక్షల 50 వేల రూపాయలకు చేరిందని తెలిపారు. ఆ నగదు బ్యాంకులో డిపాజిట్ చేసి తద్వారా వచ్చిన వడ్డీతో ప్రతి సంవత్సరం మధ్య తరగతి విద్యార్థులకు పుస్తకాల రూపంలో పెన్నులు పెన్సిళ్ల బహుకరించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ చేయూత ఫౌండేషన్ ఈపూరి బుచ్చిరాజు, అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, బొడ్డేడ అప్పారావు, బళ్ల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పిసిఒడిపై కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ భీముని గుమ్మం ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు పిసిఒడిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆసుపత్రి ఆయుర్వేద డాక్టర్ లావణ్య మాట్లాడుతూ జీవన విధానంలో మార్పులు, మంచి ఆహార ఆరోగ్య అలవాట్లు ద్వారా తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. ముఖ్యంగా యోగా వంటి సాధనల ద్వారా అన్ని రకాల ఆరోగ్య రుగ్మతలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యోగ టీచర్ ఎం చంద్రిక, కిశోర బాలికలు పాల్గొన్నారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న బత్తుల, పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీలా గోవింద సత్యనారాయణ, ఏపి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ల సురేంద్ర గురువారం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమపై నమ్మకంతో ఈ పదవులు ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

దిబ్బిడిలో హిందీ దినోత్సవం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవం గురువారం నిర్వహించారు. హిందీ సాహిత్య విస్తరణకు కృషి చేసిన రాంచంద్ర శుక్లా, కబీర్ దాస్, మీరాబాయి చిత్రపటాలకు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె సత్యారావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత కొణతాల ఎర్ని వెంకట కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఒమ్మి అప్పారావు, డివిజె. అప్పారావు, వెంకట్, పద్మావతి, అనసూయ, సిబ్బంది సాయికృష్ణ, సీతర్రి శ్రీను పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షాలకు శారద నగర్ సాయినగర్ వీధి పూర్తిగా జలదిగ్బంధంలో ఉన్నట్టు ప్రజాశక్తిలో గురువారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. జెసిబి సహాయంతో రోడ్డు పనులు ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో రోడ్డు, డ్రైనేజీలు నిర్మించి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శంకరరావుకు సన్మానం

ప్రజాశక్తి చోడవరం : చోడవరం కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా ఎన్.శంకర్రావు మంచి సేవలు అందించి అందరు మనలను పొందారని బార్ కౌన్సిల్ అధ్యక్షుడు డేవిడ్ అన్నారు. చోడవరం కోర్టు నుండి బదిలీ అయిన శంకర్‌రావును గురువారం కోర్టు ఆవరణలో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా చోడవరంలో తన సేవలను అద్భుతంగా అందించి అందరి మన్ననలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు చీపురుపల్లి సూర్యనారాయణ, పప్పల రమణమూర్తి, సరిపల్లి భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

ప్రజాశక్తి -వడ్డాది : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని పంచాయతీ ఈవో లావరాజు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో స్వచ్ఛతా హి సేవాలో భాగంగా గురువారం వనం -మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డాది సంతబయల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా టిడిపి టౌన్ అధ్యక్షులు దొండా నరేష్ మాట్లాడుతూ చెట్ల వలన స్వచ్ఛమైన గాలి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోరుకొండ సూరి అప్పారావు, సింగంపల్లి రమేష్, వైస్ ఎంపీపీ దొండ నారాయణమూర్తి, సయ్యపరెడ్డి మాధవ, తలారి శంకర, కోరుకొండ గురుమూర్తి, దండి కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అరుణకు కొణతాల పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు ఇటీవలే అకాల మరణం చెందారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గురువారం విజయనగరంలో ఉన్న అరుణ గృహానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆయన వెంట జనసేన పార్టీ నాయకులు ఉన్నారు.

జ్యూస్ షాపులకు డస్ట్ బిన్‌లు పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : హెచ్‌పిసిఎల్ - విఐఎస్ పిఎల్ పైప్‌లైన్ వారి ఆధ్వర్యంలో అసిస్టెంట్ మేనేజర్ టి.లక్ష్మణ్ చేతుల మీదుగా జ్యూస్ షాపులకు డస్ట్ బిన్స్, పారిశుద్ధ కార్మికులకు శానిటైజర్లు, సబ్బులు, సంచులు గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాపేటి శ్రీనివాసరావు, గొర్లి ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

డస్ట్ బిన్సు అందిస్తున్న అధికారులు

పరిహారం చెల్లించాలని.. కారిడార్ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములను ప్రభుత్వం ఎప్పటి నతుంచి స్వాధీనం చేసుకుంటుందో ఆనాటిని కటాఫ్ తేదీగా పరిగణించి, నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, అమలాపురం పంచాయతీ ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు డిమాండ్ చేశారు. కారిడార్ నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లించడానికి అమలాపురం పంచాయతీలో మూలపర్ర, పాటిమీద గ్రామాలకు 2010 డిసెంబర్ 29 నాటికి కటాఫ్ తేదీగా ప్రకటిస్తూ రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు బుధవారం గ్రామ సచివాలయం అధికారులు పరిహారం చెల్లించుటకు అర్హుల జాబితాతో కూడిన నోటీసు ప్రదర్శించి , దీని పై 5 రోజుల లో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రకటనతో నిర్వాసితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.అధికారులు ప్రకటించిన కటాఫ్ తేదీని వ్యతిరేకిస్తూ నిర్వాసితులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు, నిర్వాసితులు మాట్లాడుతూ, 2010 డిసెంబర్ 29న కటాఫ్ తేదీగా పరిగణించడంతో 70 శాతం ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం 2010లో భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసిందని, ఇప్పటివరకు తమ వద్ద నుంచి భూములు తీసుకోలేదని,తమ వద్ద నుంచి భూములు ఎప్పటినుంచి

ఆందోళన చేపడుతున్న నిర్వాసితులు, సిపిఎం నాయకులు

స్వాధీనం చేసుకుంటారో దానిని కటాఫ్ తేదీగా పరిగణించాలని డిమాండ్ చేశారు. 2010 డిసెంబర్ 29న కటాఫ్ తేదీగా ప్రకటిస్తే ఎలా అని ప్రశ్నించారు. కటాఫ్ తేదీని ఇప్పటివరకు దాచిపెట్టి ఇప్పుడు ప్రకటించడంతో నిర్వాసితులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేయడంతో చాలామంది నిర్వాసితులకు పరిహారం అందక నష్టపోతారని తెలిపారు.సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.2010లో భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేశారని 2024లో భూములు స్వాధీనం చేసుకుంటున్నారని, ఇప్పటి తేదీని కటాఫ్‌గా పరిగణలోకి తీసుకొని 18 సంవత్సరాల నిండిన యువతి, యువకులకు పరిహారం చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గురునాథ్, నానాజీ, శ్రీనివాస్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బుజ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా టిడిపి నేత బుజ్జి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో బుజ్జి యూత్ ఆధ్వర్యంలో గురువారం వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్, టిడిపి నేత కొప్పిశెట్టి బుజ్జి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, అధికారులు తరలివచ్చి బుజ్జి కు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు, శ్రేయోభిలాషులు ఫోన్ లో శుభాకాంక్షలు తెలియజేశారు. బుజ్జి యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

తారురోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల- ఎల్.కృష్ణాపురం కామకూటం రోడ్డును శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి గురువారం ప్రారంభించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, జనసేన పార్టీ ఇన్చార్జి రాయపూరెడ్డి కృష్ణ, మండల అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేబిస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

పశు వైద్యులు రాంబాబు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రేబిస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు రాంబాబు సూచించారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 28న రాబిస్ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాబిస్ వ్యాధి నివారణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. రేబీస్ వ్యాధి నాడీ వ్యవస్థపై దాడి చేసి చివరికి మృతి చెందుతారన్నారు. నీటిని లేదా గాలిని చూసినప్పుడు భయడటాన్ని హైడ్రోఫోబియా పిలుస్తారన్నారు. వ్యాక్సిన్ వేసి వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చునని తెలిపారు. కుక్క లేదా పశువులు కరిస్తే ఆ గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసుకోవాలని కోరారు.



మండల సర్వేయర్‌గా సురేష్

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండల నూతన సర్వేయర్‌గా పి.సురేష్ గురువారం ఉద్యోగ బాధ్య తలు చేపట్టారు. విశాఖపట్నం జిల్లా సీతమ్మధార మండలం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇంత వరకూ ఇక్కడ సర్వేయర్ గా విధులు నిర్వహించిన ఆర్ సత్యనారాయణ విశాఖ సీతమ్మదారకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సర్వేయర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు అనుసరించి సర్వే పనులు నిర్వహిస్తానన్నారు.

పాడి రైతులకు పథకాల వివరాలు తెలపాలి

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల ఏరియా పశు వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం స్థానిక ఏరియా పశు వైద్యశాలను పాడేరు డివిజన్ ఉప సంచాలకులు సి. హెచ్. నరసింహులు తనిఖీ చేశారు. పశు వైద్యశాల పరిధిలోని చీడికాడ, మాడుగుల మండలాలలో ప్రస్తుతం జరుతుగున్న ఉచిత గాలి కుంటు వ్యాధి, బ్రూసెల్లా నివారణ టీకాల కార్యక్రమంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది రైతులకు సమీకృత మిశ్రమ దాణా అందించారనే వివరాలపై ఆరా తీసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సౌజన్య, దేముడు పాల్గొన్నారు

చీడికాడ:మండలంలోని చీడికాడ, ఖండివరం, చుక్కపల్లి రైతు సేవా కేంద్రాలను పాడేరు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సిహెచ్ నరసింహులు

చీడికాడలో రికార్డులు పరిశీలిస్తున్న నరసింహులు

ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.పశు వైద్య శాలల పరిధిలో పాడి రైతులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలైన గోకులం షెడ్లు, రుణాలు, పశు భీమాపై పాడి రైతులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు, పశు వైద్యాధికారులు గాయత్రి దేవి, గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలో 8,9, 10, ఇంటర్ విద్యార్థులకు శ్రీ సత్య సాయి సేవ సంస్థల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు గురువారం నుంచి నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి దుల్లా శ్రీనివాసరావు తెలిపారు.

వ్యాస రచన రాస్తున్న విద్యార్థులు

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసుకు రావడానికి వ్యాసరచన పోటీలు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. మండలంలో ఉన్న అన్ని పాఠశాలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. గురువారం చోద్యం హైస్కూల్లో విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ సత్యనారాయణ, పద్మ, రమణ, రామకృష్ణ పాల్గొన్నారు.



జగన్‌ను కలిసిన ముత్తంశెట్టి, నాయకులు

జగన్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి-నక్కపల్లి:విజయవాడ తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని గురువారం నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షులు చిక్కాల రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు.నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను జగన్ దృష్టికి తీసుకువెళ్లారు .

భీమునిపట్నం : వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డిని గురువారం మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ అనుబంధ విభాగమైన యువజన విభాగం నాయకులు శివ నందీశ్ తాడేపల్లి, వైసిపి కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం

ప్రజాశక్తి గొలుగొండ : సమగ్ర శిక్షణ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారని జేఏసీ మండల యూనియన్ నాయకులు రాయపురెడ్డి రామకృష్ణ అన్నారు. మండలంలో ఎంఈఓ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న సిబ్బంది గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శాశ్వత ఉద్యోగులు మాదిరిగా తమకు కూడా ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తమ వేతనాలు రెండు మూడు నెలలు గడిస్తే కానీ తమకు అందలేదన్నారు.ఆగస్టు నెల జీతం ఇప్పటికీ లేదని, సెప్టెంబర్ నెల జీతం ఎప్పటికి అందుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నామన్నారు. ఈ ధర్నాలో సమగ్ర శిక్షణ లో పనిచేస్తున్న మండల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు సిబ్బంది

తహాశీల్దార్ ప్రసాద్ బాధ్యతల స్వీరణ

ప్రజాశక్తి -చీడికాడ:ఎన్నికల సమయంలో చీడికాడ మండల తహసీల్దారిగా బాధ్యతలు నిర్వహించిన బివి రాణి అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి ఏవోగా బదిలీ ఆయ్యారు. దీంతో, చీడికాడ మండల నూతన తహసీల్దారిగా వై ఎస్ వి వి ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓఎస్డిగా విధులు నిర్వహించారు.

కొత్త అందాలతో శివాజీ పార్కు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఇటీవల వరకూ శిథిల పార్కుగా ఉన్న శివాజీ పార్కు కొత్త అందాలతో నేడు స్వాగతం పలుకుతోంది. జివిఎంసి నిధులు కోట్ల రూపాయలతో ఈ పార్కును అభివృద్ధి చేశారు. ఇందులో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్లు పార్కుకు కొత్త ఇందాలను సమకూర్చాయి. సుమారు పాతికేళ్ల క్రితం మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఈ పార్కును రూ. 3 కోట్లతో నిర్మించారు. ఉద్యానవన విభాగం ఉన్నప్పటికీ నీటి సరఫరా విభాగం నిధులతో ఈ పార్కును అప్పట్లో నిర్మించడం పట్ల పలు విమర్శలు వచ్చాయి. ప్రారంభంలో ఈ పార్కును నీటి సరఫరా విభాగం వారే

వాటర్ ఫౌంటైన్లు

స్కేటింగ్ చేస్తున్న విద్యార్థులు

నిర్వహించారు.తర్వాతి కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. దీంతో, సందర్శకుల తాకిడి దాదాపు లేకుండా పోయింది.తర్వాత దీనిని ఉద్యానవన విభాగానికి అప్పగించారు. కొంతకాలం నిర్వహణ తర్వాత దీని అభివృద్ధిని పట్టించుకోవడం మానేశారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సందర్శకుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో మళ్లీ దీనికి పూర్వ వైభవం తేవడానికి అధికారులు నడుం బిగించారు. సుమారు 16 ఎకరా ల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన పార్కులో అన్ని వయసుల వారికి ఆహ్లాద పరిచేలా ఏర్పాట్లు చేశా రు. ఆడిటోరియం, పిల్లల పార్కు, స్కేటింగ్ రింక్ వ్యాయామ పరికరాలు, వృద్ధులు సేద తీరేందుకు బెంచీలు వాకింగ్ ట్రాక్ ఇలా పలు నిర్మాణాలు చేశారు. పేరుకు శివాజీ పార్కు అయినప్పటికీ ఎక్కడా శివాజీ విగ్రహం ఈ పార్క్‌లో ఏర్పాటు చేయలేదు.తాజా అభివృద్ధి పనుల్లో చత్రపతి శివాజీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయడం విశేషం. పార్కు ముఖ ద్వారం ఆధునికీకరణతో పాటు ఫ్లోరింగ్ పాటో షూట్‌కు ఉపయోగపడేలా సెంటర్ పాయింట్ అభివృద్ధి చేశారు. చిన్నారులకు ఆట పరికరాలు, అన్ని తరగతుల వారికి వాకింగ్ టైల్స్, పెయింటింగ్, లైటింగ్, మరుగుదొడ్ల మరమ్మతులు వంటివి చేశారు. ఇవన్నీ గత కమిషనర్ సాయి

కాంత్ వర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. పార్కును నిత్యం శుభ్రం చేయడానికి, ఇక్కడి పరికరాలను సంరక్షించడానికి తగినంతమంది కార్మికులను నియమించవలసిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

నీటిని విరజిమ్ముతున్న డాల్ఫిన్ ప్రతిమలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో పెండింగ్ గృహ నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సీతారామరాజు అధికారులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం హౌసింగ్, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని శనివారం ప్రతి గ్రామంలోనూ హౌసింగ్ లేఅవుట్‌లను సందర్శించి ,లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పెండింగ్ లో ఉన్న గృహాలను గుర్తించి, త్వరితగతిన నిర్మాణాలు చేపట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మౌనికను సత్కరిస్తున్న ప్రిన్సిపల్

బాక్సర్ మౌనికకు ఘన సత్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నేషనల్ బాక్సింగ్ పోటీలలో స్వర్ణ పథకం సాధించిన బాక్సర్ మౌనికను స్థానిక అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, గౌహతిలో జరిగిన నేషనల్ బాక్సింగ్ పోటీలలో మౌనిక స్వర్ణ పతకం సాధించి పట్టణానికి మంచి పేరు తెచ్చిందని, భవిష్యత్తులో మౌనిక మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. ఆహ్వానితులు వెలగా నారాయణరావు మౌనికను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాప్ కోచ్ అబ్బు తదితరులు పాల్గొన్నారు

ఆవేదన వ్యక్తం చేస్తున మహిళలు

రామచంద్రపురంలో తాగునీటికి అవస్థలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో లింగంపేట పంచాయతీ శివారు రామచంద్రపురం గ్రామంలో తాగునీటికి మహిళలు ఇక్కట్లు పడుతున్నారు. గ్రామంలో సుమారు 280 మంది జనాభా ఉన్నారు .వీరందరికి 5వేల లీటర్లు సోలార్ వాటర్ ట్యాంకును మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు 2017లో మంజూరు చేశారు. ఈ సోలార్ ట్యాంక్ రెండురోజులుగా వాతావరణం మార్పుతో నీటి సరఫరాకు సమస్య ఏర్పడింది. దీనికి తోడు గ్రామంలో ఉన్న రెండు చేతిబోర్లలో ఒక్కటి కొత్తది కావటంతో బురద నీరు వస్తుంది. మరో బోరు నెలల తరబడి మరమ్మత్తు లకు గురైంది. దీంతో, తాగునీటి కోసం గ్రామస్థులు అల్లాడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినప్పటికీ ఫలితం కనబడలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైన సంబందిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎకో టూరిజం ప్రాజెక్ట్ ప్రారంభం

ప్రారంభిస్తున్న శ్రీకంఠనాథరెడ్డి

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రకృతి అందాలను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అటవీ శాఖ కృషి చేస్తుందని ఆ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి ఎస్ శ్రీకంఠనాథ రెడ్డి అన్నారు. ఆంధ్ర కశ్మీర్ గా పేరుందిన లంబసింగి ప్రాంతంలోని పెద బరడ పంచాయతీ కృష్ణాపురం గ్రామ సమీపంలోని పైన్ తోటల వద్ద అభివృద్ధి పరచిన ఎకో టూరిజం ప్రాజెక్టును స్థానిక డివిజనల్ అటవీ శాఖ అధికారి సిహెచ్ సూర్యనారాయణతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఎకో టూరిజం ప్రాజెక్ట్‌లో కల్పించిన సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన్య ప్రాంతంలో అటవీ సంపద పుష్కలంగా ఉందన్నారు. పర్యాటక ప్రదేశాలు త్వరలోనే మరిన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. 25 హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధి పరుస్తున్న ఈ ఎకో టూరిజం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. దీని ద్వారా గ్రామంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి 21 వరకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్

-జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: జిల్లాలో ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్-2024 (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) మూడు పరీక్ష కేంద్రాలలో అక్టోబర్ 3 నుంచి 21 వరకు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 21 వరకు ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించబడునని తెలిపారు. అభ్యర్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా హాజరు కావాలన్నారు. ఏదైనా సమాచారం కొరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 లోపు సంప్రదించవచ్చు అన్నారు. సంప్రదించేందుకు సూపరింటెండెంట్ జె.సన్యాసిరావు ఫోన్: 9177292969, ఎఎస్ ఓ సిహెచ్ సుబ్రహ్మణ్యం ఫోన్: 9849245230, సీనియర్ అసిస్టెంట్ ఎవిబిఆర్ కె.పవన్ ఫోన్: 9618584051ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ శివారు కళ్యాణ్ లోవ సమీప పివిటిజీ ఆదివాసీ గ్రామంలో విద్యుత్ కనెక్షన్లు తక్షణమే ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. గోవిందరావు, మండల గిరిజన సంఘం నాయకులు గెమిలి వాసు తదితరులు డిమాండ్ చేశారు.గురువారం స్థానిక గిరిజన గ్రామంలో వారు మాట్లాడుతూ, పివిటిజీ గ్రామాలలో కేంద్ర ప్రభుత్వం పివిటిజీ కొందు గిరిజనులకు ఉచితంగా విద్యుత్తు కనెక్షన్లు ఇస్తామని ప్రకటించిందన్నారు. ఈ పథకం అమలు చేయాలని కోరుతూ రెండు నెలల కిందట రావికమతం విద్యుత్ శాఖ కార్యాలయంలో గిరిజన లబ్ధిదారులు దరఖాస్తు చేసారన్నారు. అందుకు కావాల్సిన కుల ధ్రువీకరణ ఇతర పత్రాలు సమర్పించారని వివరించారు. అయినప్పటికీ విద్యత్ మీటర్లు ఏర్పాటు చేయక పోవడం పై వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై సోమవారం నర్సీపట్నం విద్యుత్ శాఖ డిఈ కార్యాల యం వద్ద సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గేమిల రాజు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		